పర్యవేక్షణ కొరవడి

గాడి తప్పుతున్న బడి

సర్కారు బడి మళ్లీ తడబడుతోంది.. గత ప్రభుత్వం సర్కారు బడులకు జీవం పోసింది. కార్పొరేట్ స్థాయి హంగులు తీసుకొచ్చింది. రంగులు అద్ది.. మెరుగులు దిద్దింది. ఐదేళ్లు కొత్త ఒరవడితో చదువుల విప్లవం సాగింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోపే చతికిలబడుతోంది. విద్యా వ్యవస్థపై సరిగా దృష్టి సారించకపోవడంతో.. ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అంతా సర్దుబాట్లతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. పాఠశాలలు తెరిచి 50 రోజులు దాటినా.. విద్యార్థుల చేతికి ఇంకా కొన్ని పాఠ్యపుస్తకాలు అందలేదు. విద్యా కానుక కిట్ల పంపిణీ పూర్తి కాలేదు. మధ్యాహ్న భోజనం రుచి తగ్గుతూ వస్తోంది. అమ్మ ఒడి వంటి ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో.. పేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు.



రాజంపేట టౌన్: ఒకటవ వార్డు పాఠశాలలో ఒకే ఉపాధ్యాయురాలు ఉండటంతో ఐదు తరగతుల విద్యార్థులు ఒకే గదిలో కూర్చొని ఉన్న దృశ్యం

- సర్కారు బడుల్లో మళ్లీ సమస్యల పాఠాలు • ఇంకా అందని కొన్ని పాఠ్యపుస్తకాలు
- పూర్తి కాని విద్యాకానుక పంపిణీ • వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం • అవస్థలు పడుతున్న విద్యార్థులు

రాయచోటి : నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో తరగతి గదులు కొరత ఉంది. లక్కిరెడ్డిపల్లె మండలం చౌటిపల్లెలో ఎంపీపీ స్కూల్ శిథిలావస్థకు చేరుకుంది. పెచ్చులూడుతోంది. దీంతో గత ప్రభుత్వం నాడు - నేడు కింద నిధులు మంజూరు చేసింది. ఎన్నికల అనంతరం నాడు - నేడు పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో విద్యార్థులకు పాఠశాల ఎదురుగా ఉన్న పంచాయతీ కార్యాలయంలో తరగతులను నిర్వహిస్తున్నారు. అక్కడ బాత్రూం సదుపాయం లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రాయచోటి రూరల్ మండలంలో శిబ్యాల పాఠశాలలో విద్యార్థులను అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. మధ్యాహ్న భోజనం కూడా నాసి రకంగా వడ్డిస్తున్నారు. ఇదేమీ పట్టని అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. తమ పిల్లలకు సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

వెంటాడుతున్న మౌలిక వసతులు కొరత

రాజంపేట టౌన్: రాజంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థ అవస్థలు బాటలో నడుస్తోంది. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో ఉపాధ్యా యుల కొరత ఉంది. సుండుపల్లె, వీరబల్లె పలు పాఠశాలల్లో మౌలిక వసతుల కొరతతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుండుపల్లెలో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉంది. సిద్దవటంలో ఓ ఎంపీపీ స్కూల్‌లో ఉపాధ్యాయ కొరతతో ఒకే ఉపాధ్యాయురాలు 30 మంది విద్యార్థులను పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి. ఇలాంటి సంఘటన రాజంపేట పట్టణంలో కనిపిస్తోంది. దీంతో ఉపాధ్యాయులు అధిక ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. వీరబల్లె మండలంలోని పాఠశాలల్లో విద్యార్థుల వెతలు వర్ణనాతీతం. ప్రభుత్వం మారాక మధ్యాహ్న భోజన నిర్వాహకులను అధికారులపై ఒత్తిడి తెప్పించి, మార్పించిన ప్రభుత్వం, అధికార కూటమి నాయకులు.. గత ప్రభుత్వం ఇచ్చిన మెనూను మార్చకున్న వారికి వడ్డిస్తున్న భోజనంలో మాత్రం నాణ్యత లోపించింది.

రైల్వేకోడూరులో భారీగా ఉపాధ్యాయ ఖాళీలు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరత భారీగా ఉంది. దాదాపు 120 మంది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీనికి తోడు రెండో విడత నాడు-నేడు పనులు ఆగిపోవడంతో విద్యార్థులకు మౌలిక వసతులు లేవు. అలానే నియోజకవర్గంలో పూర్తి విద్యా కానుకను అందించలేదు. పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాసిరకంగా వడ్డిస్తుండటంతో విద్యార్థులు ఇంటి వద్ద నుంచే క్యారీలు తెచ్చుకుంటున్నారు. నాడు-నేడు పనులు పక్కకేశారు. చాలా పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య అధికంగా ఉంది. గత ప్రభుత్వం విద్యాకు ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య గణనీయం.. ప్రభుత్వం మారాక ఇప్పుడు వారు ప్రైవేటు బాట పట్టేలా పరిస్థితులు తయారయ్యాయి.

రైల్వేకోడూరు నియోజకవర్గం

మండలంలి	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఉపాధ్యాయ ఖాళీలు
పుల్లంపేట	62	3475	6
పెనగలూరు	67	5527	19
చిట్వేలి	64	3757	30
ఓబులవారిపల్లి	76	5900	44
రైల్వేకోడూరు	89	6400	24

రాజంపేట నియోజకవర్గం

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఉపాధ్యాయ ఖాళీలు
రాజంపేట	108	7472	11
సుండుపల్లె	86	6215	35
వీరబల్లి	70	3487	18
సిద్దవటం	55	5238	6
నందలూరు	53	3416	18

రాయచోటి నియోజకవర్గం

మండలం	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య	ఉపాధ్యాయ ఖాళీలు
రాయచోటి	119	29680	26
చిన్నమండెం	61	3978	5
గాలివీడు	86	6701	11
లక్కిరెడ్డిపల్లె	69	5023	0
రామాపురం	60	5221	0
సంబేపల్లె	76	4162	10



పెనగలూరు: శిథిలావస్థకు చేరుకున్న ఎంపీపీ స్కూల్



వీరబల్లె మండల కేంద్రంలో ఉర్దూ పాఠశాల దుస్థితి

ఆగిపోయిన పనులు



సుండుపల్లె: గోడల వరకు పూర్తి అయిన రాచంవాండ్లపల్లి ప్రీ ప్రైమరీ పాఠశాల

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు - నేడు రెండో విడతలో భాగంగా అంగన్‌వాడీ భవనాలను తీర్చిదిద్దాలనే సంకల్పం తీసుకుంది. ఇందుకు అనుగుణంగా మండలంలో రాచంవాండ్లపల్లెలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించేందుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా నిధులు కేటాయించి పనులు కూడా ప్రారంభించింది. ఎన్నికలు పూర్తై కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు పనులు అడుగు కూడా ముందుకు పడటంలేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పంచాయతీకి చేరిన బడి



పెచ్చులూడి పడుతున్న ప్రాథమిక పాఠశాల పైకప్పు



చౌటపల్లి ప్రాథమిక పాఠశాలను పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె మండలంలోని చౌటుపల్లె ప్రాథమిక పాఠశాల భవనం దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఇది శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాఠశాల పైకప్పు పెచ్చులూడుతూ ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియక ఉపాధ్యాయులు భయపడి ఎదురుగా ఉన్న పంచాయతీ కార్యాలయంలో విద్యార్థులకు బోధిస్తున్నారు.

కాలకృత్యాలకూ కష్టకాలం



సంబేపల్లె: మరుగునపడ్డ మరుగుదొడ్లు

సంబేపల్లె మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ పాలెంగడ్డ పాపన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లు మరుగునపడ్డాయి. దీంతో పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 62 మంది విద్యార్థులు కాలకృత్యులు తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం పాఠశాలను నాడు - నేడు కింద ఎంపిక చేశారు. ప్రభుత్వం మారాక పనులు ముందుకు సాగకపోవడంతో విద్యార్థుల అవస్థలు అన్నీఇన్నీ కావు.

విద్యార్థులకు అధోగతి



సిద్దవటం: మోదీన్‌సాబ్‌పల్లె ఎంపీపీ స్కూల్‌లో అన్నీ తరగతుల విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయురాలు

ఈ చిత్రంలో కనిపిస్తున్న పాఠశాల సిద్దవటం మండలం శాకరాజుపల్లె పంచాయతీలోని మోదీన్‌సాబ్‌పల్లెలోని ఎంపీపీ స్కూల్. పాఠశాలలో వివిధ తరగతులకు చెందిన మొత్తం 20 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులను చూసుకునేందుకు టీచర్లు లేకపోవడంతో ఒక ఉపాధ్యాయురాలు అన్ని తరగతుల విద్యార్థులకు బోధిస్తోంది.

పోస్టులు భర్తీ చేయాలి



ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉపాధ్యాయులపై పనిభారం ఎక్కువైంది. ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నిర్వహించాలి. ఉపాధ్యాయులపై పని భారం తగ్గించాలి. అలాగే బదిలీలను చేపట్టాలి. ఉపాధ్యాయులను నియమిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి వీలవుతుంది. అలాగే అసంపూర్తిగా ఉన్న పాఠశాలల నాడు-నేడు పనులు పూర్తి చేసి వసతులు కల్పించాలి.

- నాగినేని మనోహర్, యూటీఎఫ్ మండల అధ్యక్షులు

వసతులు కల్పించాలి



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి. ప్రస్తుతం పాఠశాలల్లో విద్యార్థులకు బాత్రూంలు, తాగునీటి సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థుల తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయకపోతే పేదలకు చదువు అందదని గ్రహించాలి. పేదల బతుకులు వారి పిల్లల చదువులే మార్చగలవనేది గుర్తించుకొని ప్రభుత్వం పాఠశాలల్లో వసతులు కల్పించాలి.

- కృష్ణచైతన్య, సీపీఐ విద్యార్థి సంఘ నియోజకవర్గ ఇన్‌చార్జ్, రైల్వేకోడూరు

విద్యా కిట్‌లు అందించాలి



మండలంలో కొన్ని పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా కిట్‌లు అందించాల్సి ఉంది. విద్యార్థులకు అందాల్సిన పాఠ్యపుస్తకాలు, బ్యాగులు, స్కూల్ డ్రస్ వంటి మెటీరియల్ కొరత ఉంది. అవి అందగానే ప్రతి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విద్యా కిట్‌లు అందజేస్తాం. ఎక్కడా ఉపాధ్యాయుల కొరత లేదు. అక్కడక్కడ చిన్నచిన్న సమస్యలు ఉన్నా వాటిని సరిదిద్దుకుని పిల్లలకు మంచి విద్యను అందించేలా ప్రణాళికలు రూపొందిస్తాం.

వెంకటసుబ్బయ్య, లక్కిరెడ్డిపల్లి-2 ఎంఈఓ

బాత్రూం లేక పిల్లల ఇబ్బందులు



నాకు ఇద్దరు కుమార్తెలు. ఇద్దరూ వీరబల్లె మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాలలో 4వ తరగతి ఒకరు, 2వ తరగతి ఒకరు చదువుతున్నారు. పాఠశాలలో విద్యార్థులు కాలకృత్యాలకు వెళ్లాలంటే బాత్రూంలు కూడా లేవు. దీంతో నా పిల్లలతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు పాఠశాలలో కనిపించడంలేదు. అధికారులు స్పందించి మౌలిక వసతులు కల్పించాలి. అర్ధాంతరంగా ఆగిపోయిన నాడు - నేడు పనులను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

- ప్రియదర్శిని, వీరబల్లె

సంక్షిప్తం

బాధ్యతల స్వీకరణ

రాయచోటి టౌన్ : మండల తహసీల్దార్‌గా పుల్లారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. సోమవరం ఆయన కార్యాలయానికి రాగానే డీటీ రామాంజనేయులు, సిబ్బంది స్వాగతం పలికారు.

అక్రమంగా మట్టిని తరలిస్తే చర్యలు

పుల్లంపేట : చెరువులోని మట్టిని అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పుల్లంపేట తహసీల్దార్ లక్ష్మీప్రసన్న అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి మూడు అర్జీలు స్వీకరించారు.

బస్సు సౌకర్యం ఏర్పాటుకు కసరత్తు

సుండుపల్లె : పీలేరు డిపో నుంచి సుండుపల్లి మీదుగా రాజంపేటకు బస్సు సౌకర్యం కల్పించేందుకు సోమవారం పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సుబ్బమ్మలు రోడ్డును పరిశీలించారు.

మన్నూరు సీఐగా రామాంజనేయుడు

రాజంపేట : మన్నూరు (రాజంపేట) సీఐగా డి.రామాంజనేయుడు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రవీంద్రను వీఆర్‌కు బదిలీ చేశారు.

'ప్రకృతి' ఉత్పత్తులు శ్రేయస్కరం

రైల్వేకోడూరు అర్బన్ : ప్రకృతి వ్యవసాయం ద్వార పండించిన కూరగాయలు శ్రేయస్కరమని అధికారి ఉషారాణి సోమవారం తెలిపారు. అనంతరాజుపేట అరుంధతివాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన స్టాల్‌ను ప్రారంభించారు.

పంట నమోదు చేపట్టండి

రామాపురం : రైతులు సాగు చేసిన పంటలను, వివరాలను ఇ- పంట యాప్‌లో నమోదు చేయాలని ఏఓ వై.నాగమణి తెలిపారు. వివరాలు ఎలా నమోదు చేయాలో సోమవారం రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు.

ముర్రుపాలు వ్యాక్సిన్‌లా పనిచేస్తాయి

పెనగలూరు : ముర్రుపాలు పుట్టిన బిడ్డకు సంజీవినీలాంటివని సీడీపీఓ రాజేశ్వరి అన్నారు. సోమవారం కొండూరు పంచాయతీ అగ్రహారంలో ప్రపంచ తల్లి పాలు వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు గర్భిణులకు శ్రీమంతం జరిపారు. అలాగే ఇద్దరు పిల్లలకు అన్నప్రాసన వేడుకలు కూడా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ విశాలాక్షి, కొండూరు సర్పంచ్ రామాంజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : తల్లిపాలే బిడ్డకు బాలామృతమని సీడీపీఓ సుగుణమ్మ పేర్కొన్నారు. సోమవారం మడితాడు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు పట్టడం వలన రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎల్లమ్మ, అంగన్‌వాడీ సూపర్ వైజర్ వనజమ్మ, హెల్త్ సిస్టెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : తల్లిపాలతో బిడ్డకు శ్రేయస్కరమని మండల వైద్యాధికారి డాక్టర్ శరత్ కమల్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండలంలోని పాటూరు గ్రామ సచివాలయ పరిధిలోని ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతులకు, తల్లులకు, అంగన్‌వాడీ టీచర్లకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి మండల వైద్యాధికారి శరత్ కమల్ వివరించారు.



పెనగలూరు: కొండూరు అగ్రహారంలో గర్భిణులకు శ్రీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ రాజేశ్వరి

ఓబులవారిపల్లె : ముర్రుపాలు బిడ్డలకు వ్యాక్సిన్‌లా పనిచేస్తాయని సీడీపీఓ సుబ్రమణ్యం పేర్కొన్నారు. సోమవారం మంగంపేట సచివాలయం భవనంలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపు తల్లిపాలను (ముర్రుపాలు) పట్టించడం ద్వారా భవిష్యత్తులో వచ్చే దీర్ఘకాలిక వ్యాధులపై వ్యాక్సిన్‌లా పనిచేస్తాయని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజశేఖర్, సూపర్‌వైజర్లు అనుసూయమ్మ, నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలే రక్ష

రైల్వేకోడూరు అర్బన్ : తల్లి పాల వల్ల బిడ్డలకు, తల్లులకు ఎంత ప్రయోజనమో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సోమవారం మండల కుక్కలదొడ్డిలో జరిగిన తల్లిపాల వారోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ సౌభాగ్యమ్మ మాట్లాడుతూ తల్లులు తమ బిడ్డలకు తల్లి పాలు పట్టించడం వల్ల భయంకరమైన వ్యాధుల నుండి రక్షణ పొందవచ్చన్నారు. తల్లిపాలే బిడ్డలకు మొదటి టీకా అని తెలిపారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

రాయచోటి అర్బన్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం మంత్రి చేతులమీదుగా ఏఐఎస్‌ఎఫ్ 89వ వార్షికోత్సవ కరపత్రాల విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమలోని క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. చదువుతో పాటు వివిధ స్థాయి పోటీలలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో చైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణ, ఏఐఎస్‌ఎఫ్ మాజీ రాష్ట్రనేత మదన్ మోహన్‌రెడ్డి, అన్నమయ్యజిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, రాయచోటి అధ్యక్షుడు ప్రశాంత్, ఉపాధ్యక్షుడు కార్తిక్, నేతలు వాసు నాయక్, శివ, సతీష్‌నాయక్, మురళి, నారాయణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్‌ఎఫ్ కరపత్రాలను విడుదల చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తాగునీటి సమస్య పరిష్కరించండి

సిద్దవటం : తమ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ మాధవరం-1 పంచాయతీ బెడుసుపల్లె కాలనీ ప్రజలు సోమవారం ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావును కోరారు. ఈ సందర్భంగా మాధవరం - 2 ఎంపీటీసీ లక్ష్మిరెడ్డి, కాలనీ ప్రజలు మాట్లాడుతూ తమకు నెలరోజులుగా తాగునీరు అందలేదన్నారు. కాలనీలో ఉన్న బోర్లలో నీరు అడుగంటాయని, సిద్దవటం పెన్నానది నుంచి వచ్చే నీరు తమకు అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలో ఎక్కడ నీరు వస్తున్నాయంటే అక్కడికి వెళ్లి 1 లేదా 2 బిందులు తెచ్చుకుంటున్నామన్నారు. అధికారులు స్పందించి తమకు తాగునీరు అందించాలని కోరారు.

ప్రభుత్వ కళాశాల సమస్యలు పరిష్కరించండి

రాయచోటి అర్బన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎస్. నరసింహ జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణకు విన్నవించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన ఎస్‌ఎఫ్‌ఐ నేతలతో కలసి డీఆర్‌ఓను కలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. బాత్రూంలకు నీటిసౌకర్యం లేదన్నారు. ప్రిన్సిపల్ నిర్లక్ష్యంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలన్నారు. మండలంలోని శిబ్యాల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో నాణ్యతలేని భోజనం పెందుతుండడంతో విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారన్నారు. శుభ్రతలేని నీటిని సేవిస్తుండడంతో ప్రమాదకరంగా మారిందన్నారు. అనంతరం ఈ మేరకు డీఆర్‌ఓకు వినతి పత్రం సమర్పించారు. ఎస్‌ఎఫ్‌ఐ నేతలు నరేష్ చందు, గురునాథ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

టీబీ ల్యాబ్ టెక్నీషియన్‌పై చర్యలు తీసుకోండి

రాయచోటి టౌన్ : ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని టీబీ ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్న ఉత్తమరెడ్డిపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ స్టూడెంట్ సెల్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు శెట్టిపల్లె సాయి డీఆర్‌ఓ సత్యనారాయణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సాయి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్‌లో టెక్నీషియన్‌గా విధులు నిర్వర్తించే ఆయన అక్కడికి వచ్చే పేషంట్స్‌ను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఊపిరితిత్తుల్లో మచ్చలు ఉన్నాయని అవి పోవాలంటే మందులు వాడాలని చెప్పుతాడని తెలిపారు. అలానే రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నాడని ఆరోపించారు. దీనిపై అధికారులు విచారణ జరిపించి అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

రాజంపేట : ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి అన్నారు. సోమవారం అన్నమయ్య సభా భవనంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని సబ్ కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిష్కార వేదికలో వచ్చిన వినతులను ఆయా శాఖల అధికారులు నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. ఒకసారి వచ్చిన వినతి తిరిగి రాకూడదని, ఆ దిశగా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. పట్టణానికి చెందిన ప్రముఖ ఆడిటర్ పంత్ కేంద్రీయ విద్యాలయానికి స్థలం కేటాయించాలని కోరారు. రాజంపేట బైపాస్‌లో కరెంటు స్తంభాలను అడ్డదిడ్డంగా నాటుతున్నారని ఫిర్యాదు చేశారు. అలాగే నందలూరు పంచాయతీలో పైపులైన్ల ఆక్రమణ, రహదారుల ఆక్రమణలపై సబ్‌కలెక్టర్ పలువురు ఫిర్యాదు చేశారు. పింగళి వెంకయ్య, రవీంద్రనాథ్ ఠాకూర్‌లకు భారతరత్న ప్రకటించాలని సీనియర్ జర్నలిస్టు అప్పారావు(కళాంజలి) సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రంను అందచేశారు.



వినతులనుపరిశీలిస్తున్న సబ్‌కలెక్టరు వైఖోమ్‌నిదియాదేవి